సాక్షి
అనంతపురం
శనివారం। 18। నవంబర్। 2023



అట్టహాసంగా కల్చరల్ ఫెస్ట్

జేఎన్‌టీయూ(ఏ)లో తొలిసారిగా నిర్వహించిన ఉత్సవ్ ఆర్ట్, కల్చరల్ ఫెస్ట్–2023 అట్టహాసంగా జరిగింది. 8లో



టీబీ డ్యాంకు తగ్గుతున్న ఇన్‌ఫ్లో

తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది. శుక్రవారం 781 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ప్రస్తుతం 23.401 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

గరిష్టం/కనిష్టం
35.6°/ 18.8°

జిల్లా అంతటా శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. వేకువజామున మంచు కురుస్తోంది.

న్యూస్‌రీల్

చిరుధాన్యాల సాగు పెరగాలి



మాట్లాడుతున్న జేసీ కేతన్‌గార్గ్, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, డీఏఓ

అనంతపురం అర్బన్: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో చిరుధాన్యాల సాగుకు మొగ్గు చూపేలా రైతులను ప్రోత్సహించాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. హెచ్చెల్సీకి నీరు ఆగిన క్రమంలో రిజర్వాయర్లలో నీటి లభ్యత తక్కువగా ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సాగుకు నీటిని విడుదల చేయడం సాధ్యం కాదన్నారు. ఉన్న నీటిని తాగునీటికే ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉందన్నారు. తక్కువ నీటిని వినియోగించే పంటలను రైతులు సాగు చేయాలన్నారు. ప్రధానంగా చిరుధాన్యాలు, అపరాల సాగుకు రైతులు ముందుకు రావాలని సూచించారు. అధికారులూ ఈ దిశగా రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ కరువు నేపథ్యంలో రైతులకు అధికారులు అండగా నిలవాలన్నారు. కరువుపై వాస్తవ నివేదికలను ప్రభుత్వానికి సకాలంలో పంపించాలని సూచించారు. కరువు నెలకొన్న 28 మండలాల్లో శనివారం నుంచి ఈ నెల 20 వరకు వ్యవసాయ, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం అంచనా వేసి, రైతుల వివరాలతో నివేదిక తయారు చేస్తామని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ తెలిపారు. కార్యక్రమంలో సీపీఓ అశోక్‌కుమార్ రెడ్డి, ఉద్యాన శాఖ డీడీ రఘునాథరెడ్డి, ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్‌ఖాన్, హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఎస్‌ఈ దేశానాయక్, ఎల్‌డీఎం సత్యరాజ్, శాస్త్రవేత్తలు, ఇతర అధికారులు, ప్రోగ్రెసివ్ రైతులు పాల్గొన్నారు.

'విద్యా దీవెన'కు జాయింట్ అకౌంట్ తెరవాలి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: జగనన్న విద్యా దీవెన పథకం కింద విద్యార్థులు, తల్లిదండ్రుల జాయింట్ అకౌంట్ తెరవాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియ ఈ నెల 24వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. జాయింట్ బ్యాంక్ అకౌంట్ అంశంపై కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులు, బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యాదీవెన కింద జిల్లాలో దాదాపు 23 వేల మంది విద్యార్థులకు జాయింట్ అకౌంట్ తెరవాల్సి ఉందన్నారు. బ్యాంకర్లకు అధికారులు తగిన సహకారం అందించాలని ఆదేశించారు. సమయం తక్కువగా ఉన్నందున కళాశాలల యాజమాన్యంతో మాట్లాడాలని చెప్పారు. జాయింట్ అకౌంట్ తెరిచేందుకు అవసరమైన డాక్యుమెంట్‌ల వివరాలను విద్యార్థులకు తెలియజేయాలన్నారు. ఈ నెల 20 నుంచి అన్ని బ్యాంకుల బ్రాంచీల్లోనూ ఈ కార్యక్రమం చేపట్టాలని సూచించారు. క్షేత్రస్థాయిలో వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్ల సహకారంతో త్వరగా చేపట్టాలని చెప్పారు. ఇందుకు సంబంధించి రోజువారీ నివేదిక అందించాలని ఆదేశించారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ జేడీ మధుసూదన్‌రావు, గిరిజన సంక్షేమాధికారి అన్నాదొర, బీసీ సంక్షేమాధికారి ఖుష్బూ కొఠారి, మైనారిటీ సంక్షేమాధికారి మహమ్మద్ రఫీ, ఎల్‌డీఎం సత్యరాజ్, బ్యాంకర్లు పాల్గొన్నారు.

అదనంగా ఒక టీఎంసీ విడుదలకు విజ్ఞప్తి



అనంతపురం సెంట్రల్: తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి మరొక టీఎంసీ నీరు విడుదల చేయాలని ఎస్‌ఈ రాజశేఖర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తుంగభద్ర బోర్డుకు, జలవనరుల శాఖ ఈఎన్‌సీ నారాయణరెడ్డికి వేర్వేరుగా లేఖలు రాశారు. ఈఎన్‌సీ స్పందిస్తూ బోర్డు అధికారులతో చర్చించారు. ఇందుకు బోర్డు అధికారులు సానుకూలంగా స్పందించారు. దీంతో మరో రెండు రోజుల్లో హెచ్చెల్సీకి నీరు నిలుపుదల కానుండగా.. ఈ నిర్ణయంతో మరో ఐదారు రోజులు పాటు అదనపు టీఎంసీ నీరు రానున్నాయని ఎస్‌ఈ రాజశేఖర్ తెలిపారు. హెచ్ఎల్ఎంసీ కింద సాగులో ఉన్న పంటలకు తడులు అందిస్తామన్నారు.

ఆరోగ్యమస్తు

రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా పయనిస్తోంది. నాడు– నేడు ద్వారా ప్రభుత్వాస్పత్రులను ఆధునికీకరించి, సౌకర్యాలు మెరుగుపరచి నాణ్యమైన వైద్యం అందిస్తోంది. మరో అడుగు ముందుకేసి ప్రతి ఇల్లూ జల్లెడపట్టి.. కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలు సేకరించి.. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా వారి చెంతకే వైద్యులను పంపింది. పరీక్షల ద్వారా జబ్బులను గుర్తించి అందుకు అవసరమైన మందులు ఉచితంగా అందించి ఆరోగ్యాన్ని కాపాడుతోంది.



అనంతపురంలోని వైద్య శిబిరంలో మహిళకు బీపీ చెక్ చేస్తున్న డాక్టర్ (ఫైల్)

- ప్రజారోగ్యానికి పెద్దపీట
- 'జగనన్న ఆరోగ్య సురక్ష'తో చెంతకే వైద్యం
- ఉమ్మడి జిల్లాలో 4 లక్షల మందికి వైద్య సేవలు
- వైద్య పరీక్షలతో కొత్త కేసులు వెలుగులోకి
- క్యాటరాక్ట్ సర్జరీలకు వేలాదిమందిసిఫారసు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: జగనన్న ఆరోగ్య సురక్ష.. ఈ పేరు వింటేనే పల్లెల్లో పేదలకు ప్రాణం లేచొచ్చినట్టు అవుతోంది. బోలెడంత మంది స్పెషలిస్టు డాక్టర్లు, కావాల్సినన్ని ఉచిత మందులు, రక్తపరీక్షలు.. ఇలా ఒకటేంటి.. ఆస్పత్రులే ఊరికి తరలించినట్టుందంటూ పొంగిపోతున్నారు. పెద్ద జబ్బులు ఉంటే గుర్తించి వెంటనే పెద్దాస్పత్రులకు తరలించి వైద్యం చేయాలని స్వయాన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే ఆదేశించడంతో పేద ప్రజలు తమ ఆరోగ్యానికి ఢోకా లేదని అంటున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కింద అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఇప్పటి వరకు నిర్వహించిన 804 వైద్య శిబిరాల్లో దాదాపు 4 లక్షల మంది వైద్యసేవలు పొందినట్టు గణాంకాలను బట్టి తేలింది. వీరిలో చాలామందికి బీపీ ఉందని కానీ, మధుమేహం ఉందని కానీ తెలియదు. వైద్య శిబిరాలలో ఈ విషయం బయటపడింది. దీనికి ఇప్పటినుంచి క్రమం తప్పకుండా మందులను సంబంధిత పీహెచ్‌సీ నుంచి తీసుకోవచ్చు. ఈ జబ్బులు గుర్తించకపోయి ఉంటే పక్షవాతం, గుండెపోటు వంటి జబ్బులకు గురయ్యేవారు. టీబీ, లెప్రసీ వంటి వ్యాధులకు కూడా టెస్టులు చేసి నిర్ధారణ అయిన వారికి మందులు ఉచితంగా ఇస్తున్నారు.

అవ్వాతాతలకు 'కంటి వెలుగు'



కొంతమంది అవ్వాతాతలు మసక చూపుతో ఇంట్లోనే ఉండేవారు. ఇప్పుడు ఊరిలోకే డాక్టర్లు వచ్చారన్న విషయం తెలుసుకుని 'కంటి వెలుగు' కింద పరీక్షలు చేయించుకున్నారు. వేలాదిమందికి కంటి పరీక్షలు నిర్వహించగా అద్దాలు అవసరమని కొందరికి, క్యాటరాక్ట్ సర్జరీ అవసరమని మరికొందరికి నిర్ధారించారు. అద్దాలు ఉచితంగా ఇస్తున్నారు. క్యాటరాక్ట్ సర్జరీలు అవసరమైన వారికి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో చేయిస్తున్నారు. అనంతపురం జిల్లాలో కంటి డాక్టర్ల కొరత కారణంగా సుమారు 4 వేల మందికి బెంగళూరులో సర్జరీలు చేయాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది.

ఇంటి దగ్గరికే వచ్చి వైద్యం



మాది శెట్టూరు మండలం యాటకల్లు గ్రామం. నాకు 70 ఏళ్లున్నాయి. బీపీ, షుగర్‌తో బాధపడుతున్నాను. ఇంతకు ముందు కళ్యాణదుర్గం, అనంతపురం ఆస్పత్రులకు వెళ్లి చూపించుకోవాల్సి వచ్చేది. అయితే ఇప్పుడు సీఎం జగన్ వచ్చాక ఇంటి దగ్గరికే డాక్టర్లు వచ్చి వైద్య పరీక్షలు చేయడంతో పాటు ఉచితంగా మందులు ఇస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది. – కేపీ వసుంధరమ్మ

అనంతపురం జిల్లాలో నవంబర్ 15 నాటికి..	
ఆరోగ్య సురక్ష ఔట్ పేషెంట్‌లు	2,17,810
కొత్తగా హైపర్ టెన్షన్ గుర్తించింది	8,681
డయాబెటిక్ బాధితులు	4,764
హిమోగ్లోబిన్ టెస్టు చేసింది	91,307
ఓ మోస్తరు రక్తహీనత ఉన్నది	34,863
కంటి పరీక్షలు చేసింది	27,018
అద్దాలు అవసరం ఉన్నవారు	16,423
క్యాటరాక్ట్ సర్జరీ అవసరం ఉన్నవారు	3,651
టీబీ టెస్టులు	6,640
టీబీ పాజిటివ్ ఉన్నవారు	16

ప్రభుత్వ మేలు మరువలేం



వృద్ధాశ్రమంలో ఉండే మాలాంటి వాళ్ల కోసం జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో ఈ నెల 5వ తేదీన వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా ఇచ్చారు. కంటి పరీక్షలు చేయించుకోగా సమస్య ఉందని చెప్పారు. అక్కడి నుంచి ప్రభుత్వ సర్వజనాస్పత్రికి రెఫర్ చేశారు. వైద్యులు చూసి కళ్లద్దాలు అవసరమని చెప్పారు. ఇన్ని రోజులు దృష్టి లోపం ఉన్నట్లు తెలియలేదు. మాలాంటి వారిని వెతుక్కుంటూ వచ్చి వైద్యం చేయించుకోండని ఎవరు చెబుతారయ్యా.. నా జీవితంలో ఇటువంటి సేవలను చూడలేదు. ప్రభుత్వం మాకు చేసిన ఈ మేలును మరువలేం.

– సుజాత, ఆర్యవైశ్య వృద్ధాశ్రమం, అనంతపురం

ప్రతి పేషెంటుకూ మెరుగైన చికిత్స



జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల ద్వారా గుర్తించిన ప్రతి పేషెంటుకూ మెరుగైన చికిత్స చేయాలనేది లక్ష్యం. పెద్ద జబ్బులైతే రెఫరల్ ఆస్పత్రులకు పంపించి ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చేస్తున్నాం. వైద్య పరీక్షలు మొదలుకొని, మందుల వరకూ అన్నీ ఉచితంగానే. ఈ క్యాంపుల ద్వారా ఎంతోమంది పేదలకు లబ్ధి జరుగుతోంది.

–గౌతమి, కలెక్టర్, అనంతపురం

నేటి నుంచి పంట నష్టం అంచనాలు



కంబదూరులో దెబ్బతిన్న వేరుశనగ

అనంతపురం అగ్రికల్చర్: వర్షాభావ పరిస్థితుల వల్ల కరువు నెలకొన్న జిల్లాలోని 28 మండలాల్లో శనివారం నుంచి పంట నష్టం అంచనాలు రూపొందించనున్నట్లు వ్యవసాయశాఖ జిల్లా కార్యాలయం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటిస్తూ గత అక్టోబర్ 31న విడుదల చేసిన జీవో 4 ప్రకారం ఈ–క్రాప్ ఆధారంగా ఆయా మండలాల్లో 33 శాతం కన్నా ఎక్కువగా నష్టం జరిగిన పంట వివరాలు నమోదు చేస్తామని పేర్కొంది. ఇందుకోసం గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో వ్యవసాయ, రెవెన్యూ అధికారులతో కమిటీలు వేసినట్లు తెలిపింది. ఈ నెల 20లోపు పంటనష్టం అంచనాలు పూర్తి చేస్తామని, 21 నుంచి 25వ తేదీ వరకు ఆర్‌బీకే వేదికగా సామాజిక తనిఖీలు నిర్వహించి, అభ్యంతరాలు ఉంటే రైతుల నుంచి స్వీకరిస్తామని వెల్లడించింది. వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి 27వ తేదీ నాటికి సమగ్ర కరువు నివేదిక తయారు చేస్తామని ప్రకటించింది. సమగ్ర నివేదికను మరోసారి పరిశీలించి పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్‌సబ్సిడీ) కోసం కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిక పంపుతామని తెలిపింది.

1.86 లక్షల హెక్టార్లలో పంట నష్టం

ఖరీఫ్–2023లో వర్షాభావం వల్ల జిల్లా వ్యాప్తంగా 1.86 లక్షల హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా వేసింది. ఇందులో వేరుశనగ 78,915 హెక్టార్లు, కంది 45,526, పత్తి 26,080, ఆముదం 22,859, మొక్కజొన్న 6,873, సజ్జ 1,765, కొర్ర 1,701, జొన్న 1,147, ఉలవ 704, పొద్దుతిరుగుడు 252, పెసర 255, మినుము 251, అలసంద 158, సోయాబీన్ 144 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు నమోదు చేసింది.

పంట నష్ట పరిహారం ఇలా...

ఇన్‌పుట్ సబ్సిడీ నిబంధనల మేరకు గరిష్టంగా రెండు హెక్టార్లు పంట నష్టాన్ని పరిగణనలోకి తీసుకుంటామని వ్యవసాయ శాఖ తెలిపింది. వేరుశనగ, పత్తి పంటలకు సంబంధించి స్కేల్ ఆఫ్ రిలీఫ్ (పంటనష్ట ఉపశమనం) హెక్టారుకు రూ.17 వేలు, జొన్న, సజ్జ, ఆముదం పంటలకు రూ.8,500, కంది, ఇతర అపరాలు, పొద్దుతిరుగుడు, సోయాబీన్ పంటలకు రూ.10 వేలు, మొక్కజొన్నకు రూ.12,500 వర్తిస్తుందని పేర్కొంది.

ఎస్ఓ, హెచ్ఎంలపై ఎస్పీడీ ఆగ్రహం



శింగనమల జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎస్పీడీ శ్రీనివాసరావు

శింగనమల: మండల కేంద్రం శింగనమలలోని కేజీబీవీ ఎస్ఓ గీతారాణి, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం సుజాతపై సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ (ఎస్పీడీ) శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన ఆయా పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేజీబీవీలో అన్నం ముద్దగా ఉండటం, ఆర్వో ప్లాంట్ పనిచేయకపోవడం, కూరగాయలు నాణ్యతగా లేకపోవడం గమనించి ఎస్ఓను నిలదీశారు. ఇక్కడ సిబ్బంది సమస్య ఉందని, తానే ఉద్యోగానికి రాజీనామా చేయాలనుకుంటున్నానంటూ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చిన ఎస్ఓపై ఎస్పీడీ సీరియస్ అయ్యారు. 'రాజీనామా చేయాలనుకుంటే చేయండి.. మీ స్థానంలో కొత్తవారిని తీసుకుంటాం.. ఎందుకు బ్లాక్ మెయిల్ చేస్తున్నారు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఆయన కలెక్టర్‌కు ఫోన్ ద్వారా తెలిపారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించి, పలు సూచనలు చేశారు. నెల తరువాత తిరిగి వస్తానని, సమస్యలు పరిష్కారం కావాలన్నారు. తర్వాత జెడ్పీ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులు అటు ఇటు తిరుగుండటం గమనించి ఆరా తీస్తే.. ఉపాధ్యాయులు రాలేదని తెలిసింది. అటెండెన్స్‌లో చాలామంది టీచర్లు లీవు పెట్టి ఉండటం కనిపించింది. అక్కడి నుంచి తరగతి గదుల్లోకి వెళ్లి పాఠ్యాంశాలపై అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు సమాధానాలు చెప్పలేకపోయారు. దీంతో హెచ్ఎం సుజాతపై ఎస్పీడీ అసహనం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు పనితీరు మార్చుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి, సీఎంఓ వేణుగోపాలు, ఎంఈఓ నరసింహరాజు ఉన్నారు.

కేజీబీవీ విద్యార్థినులు దేశం గర్వించే స్థాయికి ఎదగాలి

అనంతపురం ఎడ్యుకేషన్: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) చదువుతున్న అనాథ, పేద ఆడ పిల్లలు దేశం గర్వించేస్థాయికి ఎదిగేలా తీర్చిదిద్దాలని సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ (ఎస్పీడీ) శ్రీనివాసరావు కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా కేజీబీవీల్లో కొత్తగా చేరిన సీఆర్టీలు, పీజీటీలకు అనంతపురం నగర శివారులోని వైవీ శివారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఆరు రోజుల పాటు జరిగే శిక్షణ తరగతులను రెండోరోజు శుక్రవారం ఎస్పీడీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని విద్యార్థినులకు నాణ్యమైన విద్య అందించాలన్నారు. చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించాలన్నారు. కేజీబీవీల్లో దివ్యాంగ విద్యార్థినులకు వచ్చే ఏడాది నుంచి ప్రవేశాలు కల్పించి ప్రత్యేక టీచర్లను ఏర్పాటు చేస్తామన్నారు. శిక్షణ కేంద్రంలో ఏ ఒక్కరూ సెల్‌ఫోన్ వాడరాదన్నారు. ఇక్కడ తీసుకొనే శిక్షణ జీవితాంతం గుర్తుంటుందన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు భవిష్యత్తులో ఏవిధంగా ఉండాలి అనే అంశాలపై కూడా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఫిట్‌గా ఉండాలన్నారు. అనంతరం శిక్షణ కేంద్రంలో సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కేజీబీవీ విభాగం జాయింట్ డైరెక్టర్ గీత, జీసీడీఓ మహేశ్వరి, ఏఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్టీటీ ఐఈ కోఆర్డినేటర్ రామ్‌కమల్, సమగ్ర శిక్ష రాష్ట్ర పరిశీలకులు మహేశ్వర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, ప్రసాద్, సోనాలి, అబ్రహాం, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులు గోపాలకృష్ణయ్య, చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా కుల గణన



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జేసీ కేతన్‌గార్గ్, తదితరులు

అనంతపురం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కులగణన అత్యంత ప్రతిష్టాత్మక కార్యక్రమమని కలెక్టర్ ఎమ్.గౌతమి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కుల గణన–2023 జిల్లాస్థాయి సదస్సులో కలెక్టర్ మాట్లాడారు. ఆర్థిక, సామాజిక, విద్యాపరమైన జీవనోపాధి, జనాభా సమతుల్యత అంశాలపై కుల గణన ఉంటుందన్నారు. అణగారిన వర్గాల మరింత అభ్యున్నతికి ఈ గణాంకాలు ఉపకరిస్తాయన్నారు. ఈ నెల 27 నుంచి వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కుల గణన సర్వే నిర్వహిస్తారన్నారు. సర్వేపై విస్తృత ప్రచారం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో అందరూ భాగస్వామ్యం కావలన్నారు. ఒక్క కుటుంబాన్నీ వదలకుండా సర్వే చేయాలన్నారు.

సాహసోపేత నిర్ణయం

కుల గణన చేపట్టాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీసుకున్న నిర్ణయం సాహసోపేతమైనదని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. కుల గణనకు అన్ని సామాజిక వర్గాల వారు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. బహుజనులకు ఇంత ప్రాధాన్యత మన రాష్ట్రంలో తప్ప ఏ రాష్ట్రంలోనూ ఇవ్వలేదన్నారు. 156 కులాలకు కార్పొరేషన్లను ఏర్పాటు చేసి గౌరవప్రదమైన స్థానం కల్పించారన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, ఏడీసీసీబీ చైర్‌పర్సన్ లిఖిత, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, రిటైర్డ జడ్జి కిష్టప్ప, యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఫయాజ్, సీపీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

నేటి నుంచి సత్యసాయి జయంత్యుత్సవాలు

- 22న డీమ్డ్ యూనివర్సిటీ 42వ స్నాతకోత్సవం
- ముఖ్య అతిథిగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- 23న సత్యసాయి జయంతి వేడుకలు



సత్యసాయి చిత్రపటానికి పూజ చేసి అన్నప్రసాదాల తయారీని ప్రారంభిస్తున్న ఆర్.జె.రత్నాకరరాజు

ప్రశాంతి నిలయం: సత్యసాయి 98వ జయంత్యుత్సవాలు శనివారం నుంచి పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో జరగనున్నాయి. వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ప్రశాంతి నిలయంలో సర్వసిద్ధం చేసింది. సాయికుల్వంత్ సభా మందిరం, సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించారు. పురవీధులను మామిడి తోరణాలు, అరటి ద్వారాలు ఏర్పాటు చేసి రోడ్లను రంగవల్లులతో తీర్చిదిద్దారు. వేలాది మంది సత్యసాయి భక్తులు పుట్టపర్తికి విచ్చేస్తున్నారు. భక్తులకు సేవలందించేందుకు సేవాదళ్ సభ్యులు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి ప్రశాంతి నిలయం చేరుకున్నారు.

జయంత్యుత్సవాలు ఇలా...

- 18న ఉదయం వేణుగోపాల స్వామి రథోత్సవంతో వేడుకలు ప్రారంభం. సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో ప్రముఖ సంగీత విద్వాంసురాలు మాన్య ఆరోరా బృందం సంగీత కచేరీ.
- 19న సత్యసాయి మహాసమాధి వద్ద మహిళా దినోత్సవం నిర్వహిస్తారు. విదేశీ భక్తురాలు పెట్రాకలినోస్కీ ప్రసంగిస్తారు. వేడుకలకు గౌరవ అతిథి ఒడయార్ రాజవంశీయురాలు రాజమాతా ప్రమోదాదేవి ఒడయార్, ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే హాజరవుతారు. సాయంత్రం సుధా రఘునాథన్ బృందం సంగీత కచేరీ.
- 20న సాయంత్రం రాజేష్ వైద్య బృందం సంగీత కచేరీ నిర్వహిస్తారు.
- 21న సాయంత్రం శివశ్రీ స్కంద ప్రసాద్ బృందం సంగీత కచేరీ నిర్వహిస్తారు.
- 22న సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ 42వ స్నాతకోత్సవ వేడుకలు ప్రశాంతి నిలయంలోని సాయిహీరా గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహిస్తారు. ముఖ్య అతిథిగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరై విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తారు. సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ విద్యార్థులు కాన్వొకేషన్ డ్రామా నిర్వహిస్తారు.
- 23న సత్యసాయి జయంతి వేడుకలు సాయికుల్వంత్ సభా మందిరంలో ఘనంగా నిర్వహిస్తారు. సత్యసాయి విద్యాసంస్థల విద్యార్థుల పంచరత్నకీర్తనలు ఆలపిస్తారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు ట్రస్ట్ వార్షిక నివేదిక సమర్పిస్తారు. సాయంత్రం ప్రశాంతి నిలయం పురవీధులలో స్వర్ణ రథోత్సవం నిర్వహిస్తారు. సాయికుల్వంత్ సభా మందిరంలో జోలోత్సవం, కౌశిక్ చక్రబర్తి సంగీత కచేరీ ఉంటుంది.

నారాయణ సేవకు సర్వం సిద్ధం

సత్యసాయి జయంతి వేడుకలలో పాల్గొనేందుకు దేశ విదేశాల నుండీ తరలివచ్చే భక్తులకు మహానారాయణ సేవ కార్యక్రమంలో భాగంగా అన్నప్రసాదాల పంపిణీకి సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సర్వం సిద్ధం చేసింది. ఈ నెల 18 నుంచి ఆరు రోజుల పాటు ప్రశాంతి నిలయంలో జయంతి వేడుకలు నిర్వహించనున్న నేపథ్యంలో ప్రతి రోజూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేయనున్నారు. ఈ సందర్భంగా సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్ రాజు శుక్రవారమే సత్యసాయి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నప్రసాదాల తయారీని ప్రారంభించారు.

నేటి నుంచి ఇంటర్నేషనల్ మెడికల్ క్యాంప్

సత్యసాయి 98వ జయంతి వేడుకలను పురస్కరించుకుని ప్రశాంతి నిలయంలోని నార్త్ బిల్డింగ్స్ వద్ద శనివారం నుంచి అంతర్జాతీయ మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నారు. ఎనిమిది రోజుల పాటు దేశ, విదేశాలకు చెందిన ప్రత్యేక వైద్య నిపుణులు అమెరికాకు చెందిన డాక్టర్ గీతా కామత్ నేతృత్వంలో రోగులకు వైద్య సేవలందించనున్నారు.

అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ చరిత్రాత్మకం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా



తాడిపత్రి: అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ చరిత్రాత్మకమైనదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అన్నారు. శుక్రవారం ఆయన తాడిపత్రిలోని తన నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాల మేలు కోరుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి భూహక్కు పత్రాల పంపిణీని ఏలూరు జిల్లా నూజివీడులో ప్రారంభించడం సువర్ణ అక్షరాలతో లిఖించదగినదని కొనియాడారు. 20 సంవత్సరాలు పూర్తయిన అసైన్డ్ భూములపై పేదలకు సర్వహక్కులు కల్పించడం హర్షించదగ్గ విషయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 15,21,160 మంది అసైన్డ్ రైతులకు మేలు జరిగిందన్నారు. అలాగే 1,563 గ్రామ సచివాలయాల పరిధిలో 951 ఎకరాలను దళితుల శ్మశాన వాటికలకు కేటాయించారన్నారు. సీఎం జగన్ నిర్ణయంతో ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. ఇది పెత్తందార్ల పోకడపై పేదల పక్షపాతి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాధించిన విజయంగా అభివర్ణించారు.

క్లుప్తంగా

కంట్రోల్ సెంటర్ భవన నిర్మాణం అద్భుతం



కంట్రోల్ సెంటర్ వివరాలను జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు వివరిస్తున్న డీఆర్‌ఎం మనీష్‌అగర్వాల్

గుంతకల్లు: గుంతకల్లు డివిజనల్ కంట్రోల్ సెంటర్ భవన నిర్మాణం అద్భుతంగా ఉందని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ కొనియాడారు. శుక్రవారం డీఆర్‌ఎం కార్యాలయం సమీపంలో దాదాపు రూ.38.5 కోట్లతో నిర్మించిన కంట్రోల్ సెంటర్ ఆఫీస్‌ను డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని వర్క్‌సెంటర్‌లు, సిగ్నల్ అండ్ టెలికమ్ మెయింటెనెన్స్ రూమ్, ఆఫీసర్స్ చాంబర్లు, మీటింగ్ చాంబర్ తదితర విభాగాలను క్షుణంగా పరిశీలించారు. కార్పొరేట్ సంస్థల తరహాలో సెంట్రల్ ఏసీతో రూపుదిద్దుకున్న భవన నిర్మాణం ఆద్భుతంగా ఉందని జనరల్ మేనేజర్ కితాబిచ్చారు. కంట్రోల్ సెంటర్ నుంచి ఏ రైలు ఎక్కడ వెళ్తుంది.. ఏ సేష్టన్ సమీపంలో ఉంది.. సాంకేతిక కారణాలతో రైలు ముందుకు కదలకపోయినా, లేక రైలు మార్గంలో ఏదైనా ప్రమాదం జరిగినా, సిగ్నల్ అందకపోయినా, ఇతరత్ర కారణాల వల్ల రైళ్లు నిలిచిపోయినా తొలి సమాచారం కంట్రోల్ సెంటర్‌కు వస్తుందన్నారు. త్వరలోనే ఈ సెంటర్‌ను ప్రారంభించి పాత కంట్రోల్ ఆఫీసును ఇందులోకి మార్పు చేయనున్నట్లు తెలిపారు. దేశంలో గుంతకల్లు కంట్రోల్ సెంటర్‌కు మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎంలు సూర్యనారయణ, సుధాకర్, సీనియర్ డీఈఎన్ అక్కిరెడ్డి, సీనియర్ డీపీఓ జయశంకర్‌చౌహాన్, సీనియర్ డీసీఎం మనోజ్, ఆర్‌పీఎఫ్ కమిషనర్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జీఎం గుంతకల్లు–నంద్యాల సెక్షన్‌లో తనిఖీలు చేపట్టారు.

నెట్టికంటుడి సేవలో రైల్వే జీఎం

గుంతకల్లు రూరల్: దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ శుక్రవారం కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. స్వామివారి దర్శనార్థం శుక్రవారం ఉదయాన్నే ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు జీఎంకు స్వామివారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

అట్టహాసంగా కల్చరల్ ఫెస్ట్



యువతుల నృత్య ప్రదర్శన



కల్చరల్ ఫెస్ట్‌లో యువతుల సందడి



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

అనంతపురం: 'అత్యంత విలువైన మానవ వనరులు గల దేశంగా భారత్ ప్రపంచంలో అగ్రగామిగా ఉంది. యువశక్తి శీల దేశంగా భారత్ విరాజిల్లుతోంది' అని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ జింకా రంగజనార్దన అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం ఆడిటోరియంలో క్యాంపస్ కళాశాల ఆధ్వర్యంలో తొలిసారిగా ఉత్సవ్ పేరిట విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి పలు కార్యక్రమాలు నిర్వహించారు. అట్టహాసంగా ఉత్సవ్ ఆర్ట్స్, కల్చరల్ ఫెస్ట్–2023 శుక్రవారం ప్రారంభించారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల, పులివెందుల, కలికిరి, ఓటీపీఆర్‌ఐ కళాశాలకు చెందిన విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 1963 బ్యాచ్‌కు చెందిన గాన గంధర్వ ఎస్పీ బాలసుబ్రమణ్యం మన పూర్వ విద్యార్థి కావడం గర్వకారణమన్నారు. అలాంటి మహోన్నత వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రముఖ సినీ గేయరచయిత చంద్రబోస్ ఉమ్మడి జేఎన్‌టీయూ పూర్వ విద్యార్థి అన్నారు. ఉత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అంకితభావంతో కృషి చేసిన ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ జి. మమత, కో–కోఆర్డినేటర్ అంకారావు, డాక్టర్ అరుణలను వీసీ ప్రశంసించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సి. శశిధర్, ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అరుణకాంతి తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం

1963 బ్యాచ్‌లో బీటెక్ పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనం జరిగింది. ఉత్సవ్‌లో పాల్గొని ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆ నాటి గురువులను స్మరించుకున్నారు. ఆనాటి ఆప్యాయతలు, అనురాగాలు స్మరించుకున్నారు.



1963 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులతో జేఎన్‌టీయూ అనంతపురం వీసీ రంగజనార్దన

నిరంతరాయంగా ఆస్పత్రి అభివృద్ధి

- ఎంపీ తలారి రంగయ్య

అనంతపురం మెడికల్: 'ఆస్పత్రి అభివృద్ధికి ఫుల్‌స్టాప్ ఉండదు. నిరంతరంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేలా సీఎం వైఎస్ జగన్ నాయకత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది' అని ఎంపీ తలారి రంగయ్య పేర్కొన్నారు. శుక్రవారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో కలెక్టర్ మినరల్ ఫండ్ రూ.56 లక్షలు, ఎంపీ నిధులు రూ.20 లక్షలతో ఏర్పాటు చేసిన లేబర్ ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్‌ను ఎంపీ తలారి రంగయ్య రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. మేయర్ వసీం, ప్రిన్సిపాల్ మాణిక్యరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ ఆర్‌ఎంఓ హేమలత, గైనిక్ హెచ్‌ఓడీ షంషాద్‌బేగం థియేటర్‌లోని వివిధ విభాగాలను ప్రారంభించారు. ఎంపీ రంగయ్య మాట్లాడుతూ కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో సర్వజనాస్పత్రి వైద్యులు ఉత్తమ సేవలందించి ఎంతో మంది ప్రాణాలను కాపాడారని కొనియాడారు. కష్టతరమైన కేసులను కర్నూలు నుంచి వేలూరుకు రెఫర్ చేస్తారని తెలిపారు. వేలూరుకు వెళ్లే మార్గమధ్యంలో ఉన్న అనంతపురం సర్వజనాస్పత్రిలోనూ మెరుగైన, నాణ్యమైన వైద్యం అందుతుందన్న నమ్మకమైన వైద్యాన్ని అందించే స్థాయికి అనంతపురం ఆస్పత్రి



ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ తలారి రంగయ్య

చేరాలని ఆయన ఆకాంక్షించారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. మేయర్ వసీం మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ వైద్య కళాశాలకు ధీటుగా అనంతపురం వైద్య కళాశాలలో గైనిక్ సేవలందిస్తున్నారని కొనియాడారు. నాడు–నేడు కింద బోధనాస్పత్రికి రూ.300 కోట్లు మంజూరయ్యాయని, ఆ నిధులతో సర్జికల్, ఎంసీహెచ్ బ్లాక్ ఏర్పాటు కానున్నట్లు తెలిపారు. అనంతరం ఎంపీ, జెడ్పీ చైర్‌పర్సన్, మేయర్, తదితరులను గైనిక్ విభాగం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఆర్‌ఎంఓ డాక్టర్ పద్మజ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ శ్రీనివాస్‌శౌరీ, అబా ఇన్‌చార్జ్ అభిషేక్, డాక్టర్ సౌజన్యకుమార్, ప్రొఫెసర్లు సంధ్య, సుచిత్ర, తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ లీకై చెలరేగిన మంటలు



ప్రమాదం జరిగింది ఈ ఇంట్లోనే



కాలిపోయిన ఇంట్లోని వస్తువులు

- ముగ్గురికి తీవ్ర గాయాలు

రాప్తాడురూరల్: ఇంట్లో ఉన్న సిలిండర్ నుంచి గ్యాస్ లీకై మంటలు చెలరేగడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాలమేరకు... వెంకటరాముడు, రామాంజనమ్మ దంపతులు. బేల్దారి పని చేసుకుంటూ కక్కలపల్లిలో జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు కాగా...ఒక కుమారుడు చెన్నైలో బీటెక్ చదువుతుండగా, రెండో కుమారుడు అనంతపురంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. వెంకటరాముడు, రామాంజనమ్మ దంపతులు మాత్రమే ఇంట్లో ఉంటారు. రోజూ లాగానే గురువారం రాత్రి భోజనం చేసి పైఅంతస్తులో పడుకున్నారు. వీరితో పాటు వెంకటరాముడు తమ్ముడి కుమారుడు హేమంత్ కూడా వారివద్దే ఉన్నాడు. ఈ నేపథ్యంలోనే ఉదయం స్నానం చేసేందుకని బాత్రూమ్‌లోకి వెళ్లిన వెంకటరాముడు గీజర్‌కు అమర్చిన ట్యాప్ ఆన్ చేశాడు. దీంతో ఒక్కసారిగా పెద్ద శబ్దంతో ఇళ్లంతా మంటలు వ్యాపించాయి. తేరుకునేలోపే వెంకటముడుతో పాటు బెడ్రూంలో ఉన్న రామాంజనమ్మ, 6వ తరగతి చదువుకున్న హేమంత్‌ను మంటలు కప్పేశాయి. భారీ సౌండ్‌కు ఊరంతా ఉలిక్కిపడింది. గాయపడిన వెంకటరాముడు దంపతులతో పాటు హేమంత్‌ను అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. ఈ ఘటనలో ఇంట్లోని వస్తువలన్నీ చెల్లాచెదురయ్యాయి.

ఘటనాస్థలం పరిశీలన : ప్రమాద ఘటన తెలియగానే జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, సర్పంచ్ గార్లదిన్నె కృష్ణయ్య, రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి, సీఎస్‌డీటీ బాషా, హెచ్‌పీ గ్యాస్ టెక్నీషియన్లు అక్కడికి చేరుకున్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గ్యాస్ లీకై ఇళ్లు మొత్తం వ్యాపించి ఉంటుందని, గమనించని వెంకటరాముడు బాత్రూంలో లైటు వేసి ట్యాప్ ఆన్ చేయగానే ప్రమాదం జరిగి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జనవాక్కు

అద్దె ఇంటి కష్టాలు తీరనున్నాయి



నేను గృహిణి, నా భర్త హుసేన్‌సాబ్ లారీడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మాకు ఇద్దరు పిల్లలు. నెలకు రూ.3 వేలు చెల్లించి అద్దెకుంటున్నాము. భర్త సంపాదిస్తున్న డబ్బుతో కుటుంబ పోషణ, పిల్లల చదువులు భారమయ్యాయి. సొంతిల్లు కూడా కలగానే మిగిలిపోతుందనుకున్నాను. అయితే సీఎం జగన్ ప్రవేశపెట్టిన నవరత్నాలు–పేదలందరికీ పథకం కింద దోనిముక్కల రోడ్డు జగనన్న లేఔట్–5లో నాకు ఇంటిస్థలమిచ్చారు. ఇంటి నిర్మాణానికి ఇప్పటి వరకు రూ.1.80 బిల్లు కూడా ప్రభుత్వం చెల్లించింది. ఇంటి నిర్మాణపు పనులు చివరిదశలో ఉన్నాయి. మరికొన్ని రోజుల్లో నా సొంతిట్లోకి చేరుకోబోతున్నాను.

– షేక్ షాకీరా, ఇంటి లబ్ధిదారురాలు, గుంతకల్లు

ఇంటి దగ్గరకే వచ్చి వైద్యం



నాకు 65 ఏళ్ల వయస్సు. బీపీతో బాధపడుతున్నాను. గతంలో వైద్యం కోసం పట్టణాలకు వెళ్లేవాడిని. అయితే ఇప్పుడు గవర్నమెంటు డాక్టర్లు, నర్సులు ఇంటి దగ్గరికి వచ్చి వైద్యం చేసి మందులు ఇస్తున్నారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి కార్యక్రమాన్ని చూడలేదు. ముఖ్యమంత్రి జగన్ పేదల పక్షాన నిలిచి అన్ని రకాలుగా మేలు చేస్తున్నారు. మా లాంటి వాళ్ళకు నిజంగా ఆయన దేవుడు.

– కె. హనుమంతప్ప, శెట్టూరు

సొంతింటి కల సాకారం



నాకు ఎవరూ లేరు. ఒంటరి మహిళను. రోజూ కూలి పనికి పోతే తప్ప పూట గడవదు. అనంతపురంలోని హనుమాన్ కాలనీలో నివాసముంటున్నా. అద్దె ఇంట్లోనే జీవనం. బాడుగకు, కరెంట్ బిల్లులు కట్టేందుకు నా సంపాదన సరిపోయేది కాదు. సొంతింటిలో ఉండడం ఈ జన్మలో సాధ్యం కాదనుకున్నా. సీఎంగా జగనన్న వచ్చిన తర్వాత వార్డు సచివాలయంలో పనిచేసే లక్ష్మీనారాయణ , వలెంటీర్లు వచ్చి వివరాలు రాసుకున్నారు. ఆలమూరు లే ఔట్‌లో నాకు ఇంటి స్థలం ఇచ్చారు. ప్రస్తుతం ఇంటి నిర్మాణం పూర్తయింది. త్వరలో సొంతంటిలోకి వెళతాను. ఈ జన్మలో తీరదనుకున్న నా కలను నెరవేర్చిన మహానుభావుడు సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటా.

– జి.బీబీ, హనుమాన్‌కాలనీ, అనంతపురం

ఇబ్బందిలేకుండా ధ్రువపత్రాలు



కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం గతంలో ఎంతో ఇబ్బంది పడ్డాము. సంక్షేమ పథకాలు పొందలేకపోయాను. కానీ జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా దరఖాస్తు చేసుకున్న వెంటనే వలంటీర్ సర్టిఫికెట్లను మా ఇంటికే తెచ్చి ఇచ్చాడు. దీంతో వైఎస్సార్ రైతు భరోసా ద్వారా ప్రభుత్వం నుంచి సహాయం పొందాను. వైఎస్సార్ చేయూత పథకానికి కూడా దరఖాస్తు చేసుకుని అర్హత సాధించాను. జగన్ చేసిన మేలును మరిచిపోలేను.

– బోయ అంజినమ్మ, తిలక్‌నగర్, గుంతకల్లు

త్వరితగతిన కేసుల దర్యాప్తు

- ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం: 'ఏంటమ్మా మీ సమస్య..? పోలీసుస్టేషన్‌కు ఎందుకొచ్చారు? మీరు ఇంటికి వెళ్లండి పోలీసులే మీ ఫిర్యాదుకు పరిష్కారం చూపుతారు. మీతో అవసరమైతే ఇంటి వద్దకు వచ్చి మీతో మాట్లాడుతారు' అంటూ వెంకటసుబ్బమ్మ అనే వృద్ధురాలికి స్వయానా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. ఆయన శుక్రవారం త్రీటౌన్ పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేసేందుకు వెళ్లారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బమ్మ సమస్యను తెలుసుకున్నారు. కుటుంబ గొడవల నేపథ్యంలో పోలీసుస్టేషన్‌కు వచ్చినట్లు బాధితురాలు తెలిపారు. స్పందనలో ఇచ్చిన ఫిర్యాదు ఇక్కడికి పంపారని చెప్పగా కానిస్టేబుళ్లను పిలిచి ఈమె ఇంటి వద్దకు వెళ్లి సమస్యకు పరిష్కారం చూపాలని ఎస్పీ ఆదేశించారు. వృద్ధురాలు నడవలేని స్థితిలో ఉన్న కారణంగా వారిని ఇబ్బంది పెట్టవద్దని సూచించారు. పోలీసుస్టేషన్‌కు వివిధ సమస్యలతో వచ్చిన పిటీషనర్లతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడారు. సమస్య తీవ్రతను బట్టి విచారించి వెంటనే చర్యలు తీసుకోవాలని త్రీటౌన్ సీఐ ధరణీ కిశోర్‌ను ఆదేశించారు. పోలీసుస్టేషన్‌కు వచ్చే మహిళలు, పిల్లలు, వృద్ధులు, తదితర పిటీషనర్ల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపాలన్నారు. ఏమాత్రం జాప్యం చేయవద్దని ఆదేశించారు. అలాగే రెగ్యులర్ కౌన్సెలింగ్‌లో భాగంగా పోలీసుస్టేషన్‌కు పిలిపించిన ట్రబుల్ మాంగర్స్‌తో మాట్లాడారు. సమస్యలు సృష్టించకుండా బుద్ధిగా జీవించాలని హితవు పలికారు. యువత సమాజం పట్ల ఎంత బాధ్యతగా ఉంటే భవిష్యత్ అంత ఉన్నంతగా ఉంటుందన్నారు. తాగి తందనాలాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే డ్రంకన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్‌లో పట్టుబడిన వారితో మాట్లాడి పలు సూచనలు చేశారు. తర్వాత పోలీసుస్టేషన్ పరిసరాలు పరిశీలించారు. వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను త్వరితగతిన డిస్పోజ్ చేయాలన్నారు. గ్రేవ్ – నాన్ గ్రేవ్ యూ.ఐ (అండర్ ఇన్వెస్టిగేషన్) కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. శివారు కాలనీల్లో గస్తీ ముమ్మరం చేయాలని ఆదేశించారు. దొంగతనాలు జరగకుండా నిఘా ఉంచాలన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు.

సిబ్బంది సమస్యలపై దర్బార్

అనంతపురం క్రైం: సిబ్బంది సమస్యలపై జిల్లా ఎస్పీ అన్బురాజన్ శుక్రవారం పోలీసు కాన్ఫిరెన్స్ హాలులో దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరు మంది సిబ్బంది వారు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. చట్టపరిధిలోని సమస్యలకు పరిష్కారం చూపుతామని ఎస్పీ పేర్కొన్నారు.

యువత ఓటరు నమోదు అంతంతే

- 18–19 ఏళ్ల యువత జనాభా 1.04 లక్షలు
- ఓటు హక్కు పొందిన యువత 12,804 మంది మాత్రమే

అనంతపురం అర్బన్: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ–2024 కార్యక్రమంలో యువతను ఓటరుగా నమోదు చేయడం ప్రధాన అంశం. ముఖ్యంగా 2024 జనవరి 1వ తేదీకి 18 ఏళ్లు నిండే యువతను ఓటరుగా నమోదు చేయాలి. అయితే జిల్లాలో యువ ఓటర్ల నమోదు అంతంత మాత్రంగానే జరిగిందనేందుకు ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం వయసు 18–19 ఏళ్ల ఓటర్ల సంఖ్య నిదర్శనంగా నిలుస్తోంది. జిల్లాలో 19,77,660 మంది ఓటర్లు ఉండగా 18–19 ఏళ్ల వయసు వారు 0.5 శాతం మాత్రమే ఉండడం గమనార్హం. అర్హత ఉన్న యువతను ఓటరుగా నమోదు చేయడంపై యంత్రాంగం శ్రద్ధ పెట్టలేదనే విషయం తెలుస్తోంది.

18–19 వయసు ఓటర్లు 12,804

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో 2024 జనవరి 1వ తేదీ నాటికి ఓటు హక్కు పొందేందుకు అర్హత ఉన్న 18–19 ఏళ్ల వయసు వారు 1,04,502 మంది (3.86 శాతం) ఉంటారని అధికారిక అంచనా. ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో 19,77,660 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 18–19 ఏళ్ల వయసు కలిగిన ఓటర్లు 12,804 మంది ఉన్నారు. మొత్తం ఓటర్లలో ఈ వయసు వారు 0.5 శాతం ఉన్నట్లు నివేదిక చెబుతోంది.

30–39 వయసు వారు అధికం

ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం 19,77,660 మంది ఓటర్లలో అత్యధికంగా 30–39 ఏళ్ల వయసు కలిగిన వారు 5,85,356 మంది ఉన్నారు. వయసు 20–29 ఏళ్ల ఓటర్లు 3,19,790 మంది, 40–49 ఏళ్ల మధ్య ఓటర్లు 4,29,986 మంది ఉన్నారు. ఇక 50–59 ఏళ్ల వయసున్న ఓటర్లు 3,02,736 మంది, 60–69 ఏళ్ల వయసున్న ఓటర్లు 1,89,926 మంది, 70–79 ఏళ్ల వయసున్న ఓటర్లు 1,02,921 మంది ఉన్నారు. వయసు 80 ఏళ్లు అపై ఉన్న ఓటర్లు 34,141 మంది ఉన్నారు.

మహిళను ఏమార్చి నగదు అపహరణ



ఏటీఎం కేంద్రంలో ఎస్తర్ రాణిని ఏమారుస్తున్న దుండగుడు

గుత్తి: గుర్తు తెలియని దుండగుడు ఓ మహిళను ఏమార్చి ఏటీఎం కార్డు కొట్టేసి రూ. 25 వేలు అపహరించిన సంఘటన గుత్తిలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గుత్తి పట్టణానికి చెందిన ఎస్తర్ రాణి అలియాస్ మునీంద్రమ్మ అనంత ప్రగతి గ్రామీణ బ్యాంకు ఏటీఎం కేంద్రంలో డబ్బు డ్రా చేసుకోవడానికి వెళ్లింది. అయితే ఏటీఎం కార్డు ద్వారా డబ్బు డ్రా చేయడానికి ప్రయత్నిస్తున్న సమయంలో అప్పటికే అక్కడ కాపు కాసి ఉన్న ఓ దుండగుడు తాను డబ్బు డ్రా చేసి ఇస్తానని ఏటీఎం తీసుకున్నాడు. ఆ సమయంలో ఆమెను ఏమార్చి ఒరిజినల్ ఏటీఎం కార్డు కొట్టేసి డూప్లికేట్ ఏటీఎం కార్డు ఇచ్చి అక్కడి నుంచి జారుకున్నాడు. ఆ తర్వాత పలు ఏటీఎం కేంద్రాల్లో కొట్టేసిన ఏటీఎం ద్వారా మొత్తం రూ. 25 వేలు డ్రా చేసుకుని ఉడాయించాడు. ఈ దృశ్యాలు సీసీ ఫుటేజీలో రికార్డు అయ్యాయి. ఎస్తర్ రాణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సిద్ధమవుతున్న పదోన్నతుల జాబితా

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ పరిధిలో పని చేసే ఉద్యోగుల సీనియారిటీ జాబితా సిద్ధమవుతోంది. జిల్లా, మండల పరిషత్ కార్యాలయాలతో పాటు జెడ్పీ ఉన్నత పాఠశాలలు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని జెడ్పీ అధికారులు ఇప్పటికే కోరారు. 63 మండలాలకు చెందిన ఉద్యోగుల వివరాలన్నీ వచ్చాక సీనియారిటీలో ఎంత మంది ఉద్యోగులు ఉన్నారనే సంగతి తెలుస్తుంది. ఆ తరువాత ప్యానల్ రెడీ చేస్తారు. రోస్టర్ తయారు చేసి ఖాళీలను బట్టి ఎంత మందికి పదోన్నతులు ఇవ్వొచ్చో లెక్క తేలుస్తారు. సీనియారిటీని బట్టి సమగ్ర వివరాలతో నివేదిక రూపొందిస్తారు. వాటిని డిప్యూటీ సీఈఓ లలితాబాయికి సమర్పిస్తారు. ఆమె పరిశీలించి ఇన్‌చార్జ్ సీఈఓ కేతన్‌గార్గ్‌కు ఫైల్ పెడతారు. అక్కడ ఒకే అయ్యాక జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అనుమతి కోసం ఫైల్ పంపిస్తారు. ఆ నిర్ణయం తరువాత పదోన్నతులు కల్పిస్తారు.

కన్న తల్లి పాపం.. బిడ్డకు శాపం

- ముగ్గురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

అనంతపురం క్రైం: కామంతో కళ్లు మూసుకుపోయిన ఓ తల్లి చేసిన ఘన కార్యం బిడ్డ పాలిట శాపంగా మారింది. వన్‌టౌన్ సీఐ రెడ్డెప్ప తెలిపిన వివరాలమేరకు... కూడేరుకు చెందిన నాగభూషణం, సుశీలమ్మ దంపతులకు ఒక కుమార్తె ఉంది. ముగ్గురు కలసి అనంతపురంకు వలస వచ్చారు. నవోదయ కాలనీలో బేల్దారి పని చేస్తూ నాగభూషణం కుటుంబాన్ని పోషించేవాడు. గుంటూరు నుంచి అనంతకు పనికొచ్చిన నరసింహులు అనే వ్యక్తి వారికి పరిచయమయ్యాడు. సుశీల, నాగభూషణం దంపతుల వద్దకు అప్పుడప్పుడు వచ్చి వెళ్లేవాడు. ఈ క్రమంలో సుశీలతో వివాహేతర సంబంధం కొనసాగించాడు. వారం రోజుల క్రితం సుశీల కుమార్తెను తీసుకుని గుంటూరుకు చెందిన నరసింహులుతో వెళ్లిపోయింది. నాగభూషణం వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. గుంటూరుకు చెందిన నరసింహులుతో వెళ్లారని, ప్రస్తుతం వారు ఏలూరులో తలదాచుకుంటున్నట్లు పోలీసులు గుర్తించారు. కాగా సుశీల.. నరసింహులు మేనల్లుడికి తన కుమార్తె(16)ను ఇచ్చి బలవంతంగా వివాహం జరిపించిందని తెలియడంతో సీరియస్‌గా పరిగణించిన పోలీసులు నరసింహులుతో పాటు అతని అల్లుడు నాగరాజును, సుశీలమ్మను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మైనర్‌ను బలవంతంగా పెళ్లి చేసుకున్న నాగరాజుపై పోక్సో కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

మహిళా సాధికారత కోసం బైక్ ర్యాలీ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఇన్నర్‌వీల్ సభ్యులు

అనంతపురం కల్చరల్: మహిళా సాధికారతే లక్ష్యంగా ఇన్నర్‌వీల్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఇన్నర్‌వీల్ అధ్యక్షురాలు పీటీ పద్మ తెలిపారు. ఇన్నర్‌వీల్ సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పీటీ పద్మ, పాస్ట్ డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ శ్రీవల్లి, కార్యవర్గ సభ్యులు ప్రతిమా సుధీర్, శాంతి, జయంతి తదితరులు మాట్లాడారు. ఈనెల 19న ఉదయం 8 గంటలకు స్థానిక సప్తగిరి సర్కిల్‌లోని ఇన్నర్‌వీల్ బస్టాప్ నుంచి నగర వీధుల్లో వందలాది మంది మహిళలతో బైక్ ర్యాలీ సాగుతుందన్నారు. మహిళల సాధికారత, రోడ్డు భద్రత అంశాలపై నిర్వహించే బైక్ ర్యాలీని కలెక్టర్ గౌతమి, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య ప్రారంభిస్తారన్నారు.

రేపు చం. స్పందన పురస్కార సభ

అనంతపురం కల్చరల్: స్పందన అనంత కవుల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10.30 గంటలకు చం.స్పందన పురస్కారాలు అందిస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. సుంకర గోపాలయ్య, రాఘవేంద్ర, పెరిశెట్ల శివకుమార్, స్వయం ప్రభలకు సాహితీ పురస్కారాలు అందిస్తున్నట్లు తెలిపారు.

రేపటి నుంచి కార్తీకమాసోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవాలు ఈ నెల 19 నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ అక్కిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ దుబ్బ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. వారు మాట్లాడుతూ 19న శ్రీ వల్లి, దేవసేన, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలకు కల్యాణోత్సవం జరిపించనున్నట్లు తెలిపారు. 26న సర్పభూషణ రుద్ర సహిత సర్ప శాంతి హవనం, 27న సామూహిక సత్యనారాయణ వ్రతం, కార్తీక పౌర్ణమి విశేష పూజ ఉంటుందన్నారు. డిసెంబర్ 3న కార్తీక కోటి దీపోత్సవం, తులసీదామోదర కల్యాణోత్సవం ఉంటుందన్నారు. 10న సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం ఉంటాయన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీల ప్రభుపాదుల తిరోభావతిథి




అభిషేకం చేస్తున్న ఇస్కాన్ చైర్మన్ గౌరంగదాసు ప్రభు

అనంతపురం కల్చరల్: ఇస్కాన్ వ్యవస్థాపకులు శ్రీల ప్రభుపాదుల వారి తిరోభావతిథి శుక్రవారం ఘనంగా జరిగింది. ఇస్కాన్ మందిరంలో ఉదయం ప్రభుపాదుల విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు, పుష్పాలంకార సేవలు జరిగాయి. వందల మంది భక్తులు ఆటపాటల నడుమ రాధాపార్థసారథులను కీర్తిస్తూ భజనలు చేశారు. ఇస్కాన్ మందిరం చైర్మన్ దామోదర గౌరంగదాసు తన ప్రవచనంలో శ్రీల ప్రభుపాదుల ఆదర్శ జీవితాన్ని వివరించారు. అనంతరం మహా పుష్పహారతి, తీర్థప్రసాద వితరణ జరిగింది.

జాతీయ ఉత్తమ రైతుగా గోపాల్ గుప్తా

గుత్తి: జాతీయ ఉత్తమ ఆర్గానిక్ రైతుగా గుత్తికి చెందిన ప్రముఖ వ్యాపారి, రైతు అయిన ఐసికాల్ గోపాల్ గుప్తా ఎంపికయ్యారు. ఈ మేరకు న్యూఢిల్లీకి చెందిన లీగల్ సర్వీసెస్ రైట్ ప్రొటెక్షన్ సంస్థ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 26న న్యూఢిల్లీలో జరిగే కార్యక్రమంలో గోపాల్ గుప్తాకు అవార్డు ప్రదానం చేయనున్నారు.

విశ్రాంత బ్యాంకు మేనేజర్ మృతి



వేణుగోపాల్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న తోపుదుర్తి చందు

ఆత్మకూరు: ఆత్మకూరుకు చెందిన విశ్రాంత బ్యాంకు మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి (75) గురువారం మరణించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి (చందు) శుక్రవారం వేణుగోపాల్‌రెడ్డి మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. కుటుంబ పెద్దను కోల్పోవడం చాలా బాధాకరమన్నారు.

కాలువల నిర్మాణానికి ప్రత్యేక చర్యలు



కాలువ పనులకు భూమి పూజ చేస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 14వ డివిజన్‌లో రూ.27 లక్షలతో కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య పేర్కొన్నారు. శుక్రవారం శుక్రవారం కాలువల నిర్మాణ పనులను ప్రారంభించారు. మేయర్ వసీం మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో వర్షం వస్తే నగరంలో ఎక్కడికక్కడ కాలువలు నిండి, మురుగు పారేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో కొచ్చిన తర్వాత ప్రధాన, అంతర్గత రోడ్లతో పాటు కాలువల ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు తెలిపారు. నగరపాలక సంస్థ సాధారణ, గడప గడపకూ మన ప్రభుత్వం, 15వ ఆర్థిక సంఘం, తదితర నిధులతో పెద్ద ఎత్తున అభివృద్ధి చేపట్టి నగరం రూపురేఖలు మార్చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు చర్యలు.. 42వ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో 19 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. విద్యుత్ స్తంభాల పనులను మేయర్ శుక్రవారం పరిశీలించారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలు ప్రభుత్వం త్వరితగతిన పరిష్కరించినట్లు తెలిపారు. మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్, కార్పొరేటర్లు అబూసలేహ, కమల్ భూషణ్, అనిల్‌కుమార్‌రెడ్డి, ఈఈ సూర్యనారాయణ, డీఈ సుభాష్, ఏఈ బాబావలి, నాయకులు షెక్షావలి, రామాంజనేయులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్టకు ఎమ్మెల్యే విరాళం



ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న మరూరు గ్రామస్తులు

కనగానపల్లి (రాప్తాడు): రాప్తాడు మండలంలోని మరూరులో పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట కోసం రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి రూ.లక్ష విరాళం ఇచ్చారు. గ్రామస్తులు ఎమ్మెల్యేను శుక్రవారం కలిసి ఈ నెల 19న జరిగే విగ్రహ ప్రతిష్టకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తనవంతు సాయంగా విరాళం అందించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు నారాయణ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

గుడికట్ల సంబరాల పోస్టర్ల విడుదల



పోస్టర్లను విడుదల చేస్తున్న కురుబ సంఘం నాయకులు

ఆత్మకూరు: మండల కేంద్రంలోని శ్రీ కనకదాస కల్యాణమండపంలో జిల్లా కేంద్రంలో ఈనెల 19న జరగబోవు గుడికట్ల సంబరాల పోస్టర్లను విడుదల చేశారు. కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ 13వ శతాబ్దంలో హంపీలో 77 గుడికట్లతో సంబరాలు జరుపుకున్నారన్నారు. ప్రస్తుతం 250 గుడికట్లతో అనంతపురం నగరంలో సంబరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సహకార రంగం మరింత పటిష్టం

- వారోత్సవాల్లో డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.లిఖిత



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.లిఖిత

అనంతపురం అగ్రికల్చర్: సహకార వ్యవస్థ, సహకార రంగాన్ని మరింత పటిష్టం చేస్తూ మెరుగైన సేవలు అందించాలంటే ఆధునికత అందిపుచ్చుకోవాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్‌పర్సన్ ఎం.లిఖిత తెలిపారు. అఖిల భారత 70 సహకార వారోత్సవాల్లో భాగంగా నాల్గో రోజు శుక్రవారం స్థానిక రాయలసీమ సహకార శిక్షణా కేంద్రంలో కార్యక్రమం నిర్వహించారు. చైర్‌పర్సన్ ఎం.లిఖిత మాట్లాడుతూ సహకార బ్యాంకులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, బహుళ రాష్ట్ర సహకార సంఘాలు ఆర్థిక పురోగతి సాధించడానికి ఆధునిక పరిజ్ఞానం జోడించాలన్నారు. రైతులు, ఇతర అన్ని వర్గాలకు ప్రయోజనాలు కల్పించడానికి కృత్రిమ మేధస్సు, యంత్ర అభ్యసనం, బ్లాక్‌చైన్ టెక్నాలజీ, డిజిటలీకరణం లాంటివి అవసరమన్నారు. ఇందుకోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసులు, జిల్లా సహకార అడిట్ అధికారి నాగరాజు, డీసీసీబీ విశ్రాంత సీఈవో డాక్టర్ వేములేటి నరసింహారెడ్డి, కేంద్రం అధ్యాపకులు ఎల్.రాజారెడ్డి, జేమేధిని, కె.నాగవీణ, డీఎల్‌సీవో కె.బాలగంగాధర్ హాజరయ్యారు.

అభివృద్ధి పనులు వేగవంతం

- సీఎస్‌కు వివరించిన కలెక్టర్ గౌతమి



కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: కేంద్రీయ విశ్వవిద్యాలయంలో అభివృద్ధి పనులు వేగవంతం చేశామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డికి కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు విద్యాసంస్థలు, ప్రాజెక్టుల్లో మౌలిక సదుపాయాలు, తదితర అంశాలపై సీఎస్ శుక్రవారం విజయవాడ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. అనంతపురం కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు. కేంద్రీయ విశ్వవిద్యాలయంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని సీఎస్‌కు కలెక్టర్ వివరించారు. ఇరిగేషన్ చానల్ ఏర్పాటులో నెలకొన్న సమస్యను పరిష్కరించామని చెప్పారు. ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయన్నారు. యూనివర్సిటీకి విద్యుత్ సరఫరా కోసం 33 కేవీ సబ్‌స్టేషన్ మంజూరైందన్నారు. భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. పనులు వేగవంతం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలియజేశారు. పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సెంట్రల్ వర్సిటీ డీన్ రామిరెడ్డి, ప్రొఫెసర్ హనుమాన్ కెనడి, ఆర్‌డీఓ గ్రంధి వెంకటేష్, ఎస్‌పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు, ఎస్‌ఈ సురేంద్ర, పంచాయతీరాజ్ ఎస్‌ఈ భాగ్యరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఇహషాన్‌బాషా, అధికారులు పాల్గొన్నారు.

మందులు అధిక ధరలకు విక్రయించరాదు



రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ సుచరిత

ఆత్మకూరు: ఫర్టిలైజర్స్ దుకాణంలో అధిక ధరలకు ఎరువు, పురుగు మందులు విక్రయించరాదని ఏఓ సుచరిత తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్స్ దుకాణాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన అనంతరం ఏఓ మాట్లాడుతూ రైతులకు విక్రయించే ఎరువులు, మందులు, విత్తనాలను అధిక ధరలకు విక్రయించరాదన్నారు. నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నెలకు పది ప్రసవాలు చేయాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి

అనంతపురం మెడికల్: ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకు 10 ప్రసవాలు తప్పనిసరిగా చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి ఆదేశించారు. శుక్రవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో గత నెలలో జరిగిన రెండు మాతృ, ఆరు శిశు మరణాలపై సంబంధిత ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు, సిబ్బందితో డీఎంహెచ్‌ఓ సమీక్ష నిర్వహించారు. మాతా శిశు మరణాలు ఉండకూడదన్నారు. ప్రతి గర్భిణీ 12 వారాలలోపు రిజిస్ట్రేషన్ చేసుకొని ఆమెకు అన్ని రకాల వైద్య పరీక్షలు, సేవలందించాలన్నారు. ఏ తల్లి ప్రసవం అనంతరం అధిక రక్తస్రావంతో మరణించకూడదని, ప్రతి గర్భిణీని పరీక్షించాలన్నారు. ప్రమాదకర గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సమావేశంలో మదర్ అండ్ చైల్డ్ హెల్త్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ యుగంధర్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్, పీడియాట్రీషియన్ డాక్టర్ శంకర్‌నారాయణ, డాక్టర్ విజయ్‌కుమార్, ఎంపీహెచ్‌ఈఓ లక్ష్మన్న, ఎంపీహెచ్ఎస్ హేమలత, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ స్టేడియంలో మల్టీడే క్రికెట్ మ్యాచ్ ప్రారంభం



తలపడుతున్న ఆంధ్రప్రదేశ్, తమిళనాడు జట్లు

అనంతపురం: స్థానిక ఆర్డీటీ స్టేడియంలో శుక్రవారం ప్రారంభమైన మ్యాచ్‌లో తమిళనాడు తొలి రోజే మెరుగైన ఆట తీరు కనబర్చింది. బీసీసీఐ కూచ్ బెహర్ ట్రోఫీ (అండర్-19 పురుషుల) మల్టీడే మ్యాచ్‌లో భాగంగా ఆంధ్రప్రదేశ్ - తమిళనాడు జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. తమిళనాడు మూడు వికెట్ల నష్టానికి 253 పరుగులతో మెరుగైన ఆటతీరు కనబరిచింది. షేరింక్ 281 బంతుల్లో 126 పరుగులు (16 ఫోర్లు, 1 సిక్సర్) సెంచరీ, అక్షయ్ ఆర్. సారంగధర్ 91 పరుగులు చేయడంతో జట్టు గణనీయమైన స్కోరు సాధించింది.

పరిమితికి మించి తీసుకెళ్లొద్దు



ఆటోడ్రైవర్లకు సూచనలు ఇస్తున్న ఎస్ఐ జనార్దన్

ఆత్మకూరు: ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లొద్దని ఎస్ఐ జనార్దన్ సూచించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు మద్యం సేవించి నడపరాదన్నారు. రోడ్లపైకి వచ్చినప్పుడు ప్రతి ఒక్కరూ యూనిఫాం వేసుకోవాలని, డ్రైవింగ్ లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు. ఏదైనా అనుకోకుండా ప్రమాదం జరిగితే వెంటనే 108కు, పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

ఉరివేసుకొని పశ్చిమ బెంగాల్ వాసి ఆత్మహత్య



ఇస్లాం మృతదేహం

చెన్నేకొత్తపల్లి: మండలంలోని నాగసముద్రం రైల్వేస్టేషన్ వద్ద పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన ఇస్లాం (22) ఆర్థిక సమస్యలతో శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. నాగసముద్రం రైల్వేస్టేషన్ వద్ద జరుగుతున్న రైల్వే డబ్లింగ్ లైన్ పనుల కోసం పశ్చిమ బెంగాల్ జోట్ కస్తూరి గ్రామానికి చెందిన ఇస్లాం రెండు నెలల క్రితం వచ్చాడు. స్థానిక రైల్వేస్టేషన్ వద్ద చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య సరీఫా, ఒక కుమారుడు ఉన్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

కనగానపల్లి: మండలంలోని చంద్రాచర్లకు చెందిన భాస్కర్‌రెడ్డి అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానిక గ్రామస్తులు తెలిపిన మేరకు.. చంద్రాచర్ల గ్రామానికి చెందిన సూర్యనారాయణ రెడ్డి కుమారుడు భాస్కరరెడ్డి బెంగళూరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేసేవాడు. ఈ మధ్యనే ఇంటికి వచ్చి పొలం పనులు చూసుకునేవాడు. శుక్రవారం ఇంట్లోనే పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి, వెంటనే ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

సర్వజనాస్పత్రిలో పునరుద్ధరణ పనులు



ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని లేబర్ వార్డులో పెయింటింగ్ చేస్తున్న దృశ్యం

అనంతపురం మెడికల్: ప్రభుత్వం ప్రభుత్వ సర్వజనాస్పత్రికి కేటాయించిన రూ.3.5 కోట్ల నిధులతో ఆస్పత్రిలోని వివిధ విభాగాల్లో మరమ్మతు, పునరుద్ధరణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఆస్పత్రిలోని గైనిక్, లేబర్, చిన్నపిల్లల, మెడిసిన్, ఆర్థో తదితర వార్డుల్లో గ్రిల్స్‌కు ఉన్న పాత షీట్లను తొలగించి, వాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా వివిధ వార్డుల్లో పెయింటింగ్ పనులు జరుగుతున్నాయి. నిర్దేశిత సమయంలో పనులన్నీ పూర్తయితే రోగులకు మరింత మెరుగైన సేవలందుతాయి.

ఉద్యోగుల సమష్టి సహకారంతోనే పురోగతి



ఎస్కేయూ వీసీ దంపతుల్ని సన్మానిస్తున్న ప్రొఫెసర్లు

అనంతపురం: వర్సిటీ ఉద్యోగుల సంపూర్ణ, సమష్టి సహకారంతోనే మూడేళ్లలో గణనీయమైన పురోగతి సాధించామని ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి పేర్కొన్నారు. వీసీగా బాధ్యతలు చేపట్టి ఈ నెల 23కు మూడేళ్లు పూర్తి కానున్న సందర్భంగా వర్సిటీ ప్రొఫెసర్లు వీసీ దంపతుల్ని ఘనంగా సత్కరించారు. వీసీ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి నిబద్ధతతో బాధ్యతలు నిర్వర్తించడంతో వర్సిటీ అభివృద్ధికి కృషి చేసినట్లు తెలిపారు. ఎస్కేయూకు ఆసియా స్థాయిలో 400-500 మధ్యలో ర్యాంకు రావడం గర్వకారణమన్నారు. వీసీ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య వివరించారు. క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచారన్నారు. అన్యాక్రాంతం అయిన వర్సిటీ భూమిని పరిరక్షించారన్నారు. కార్యక్రమంలో మాజీ రెక్టార్ ప్రొఫెసర్ ఏ. మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు.

ఉరవకొండ ఏపీపీపై కేసు నమోదు

అనంతపురంక్రైం: ఇంట్లో పనిచేసే అమ్మాయిపై పైశాచికంగా దాడి చేసిందన్న ఆరోపణల నేపథ్యంలో ఉరవకొండ ఏపీపీ వసంతలక్ష్మీబాయిపై కేసు నమోదయ్యింది. త్రీటౌన్ సీఐ ధరణికిశోర్ తెలిపిన మేరకు.. స్థానిక రెవెన్యూ కాలనీలో నివాసం ఉంటున్న ఉరవకొండ ఏపీపీ వసంతలక్ష్మీబాయి ఇంట్లో ఏడాదిగా సాదిక అనే అమ్మాయి పనిచేస్తోంది. ఏపీపీ కుమారుడిని సంరక్షణ చూసుకుంటోంది. అయితే గురువారం రాత్రి సాదిక ఉన్నపళంగా స్పృహతప్పి పడి ఉంది. ఒంటిపై గాయాలు కనిపించాయి. ఏపీపీ తండ్రి రంగస్వామినాయక్ గోరంట్ల నుంచి వచ్చి సాదికను చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. సాదిక తల్లి కూడా గోరంట్లలో ఏపీపీ తండ్రి ఇంట్లో పని మనిషిగా ఉంటోంది. అమ్మాయి ఆరోగ్యంగా కోలుకున్న తర్వాత దాడికి గల కారణాలు తెలిసే అవకాశం ఉందని సీఐ ధరణికిశోర్ తెలిపారు.

డీఈ రాంప్రసాద్ రెడ్డి బదిలీ

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో పని చేసే డీఈ రాంప్రసాద్ రెడ్డి గుత్తి మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. ఈ మేరకు ఇంజనీరింగ్ చీఫ్ ఉత్తర్వులు జారీ చేశారు. గుత్తి మునిసిపాలిటీలో డీఈగా ఉన్న రఘు నగరపాలక సంస్థకు బదిలీ అయ్యారు. డిప్యుటేషన్‌పై వీరిద్దరూ బదిలీ అయ్యారు.

గొర్రె పిల్లకు శస్త్ర చికిత్స



గొర్రె పిల్లకు మలద్వారం ఏర్పాటుకు శస్త్ర చికిత్స చేస్తున్న వెటర్నరీ వైద్యులు

శింగనమల: స్థానిక పశువైద్యశాలలో శుక్రవారం గొర్రెపిల్లకు శస్త్రచికిత్స చేశారు. గార్లదిన్నె మండలం మర్తాడుకు చెందిన రమేష్ గొర్రె పిల్ల మలద్వారం లేకుండా పుట్టింది. వెటర్నరీ ఏడీ పద్మనాభం, డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి గొర్రె పిల్లకు శస్త్ర చికిత్స ద్వారా మలద్వారం ఏర్పాటు చేశారు.

పెద్ద తెరపై క్రికెట్ ఫైనల్ మ్యాచ్

అనంతపురం: ఈ నెల 19న జరగనున్న భారత్ - ఆస్ట్రేలియా ఫైనల్ క్రికెట్ మ్యాచ్‌ను పెద్ద తెరపై (ఫేన్ ఎరినా) తిలకించేందుకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు ఏసీఏ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథ్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనంతపురం నగరంలో పీటీసీ (పోలీస్ ట్రైనింగ్ కాలేజ్)లో మధ్యాహ్నం 1:30 గంటల నుంచి పెద్ద స్క్రీన్‌పై మ్యాచ్ వీక్షించేందుకు ఏర్పాట్లు చేశారు. స్టేడియంలో ప్రశాంత వాతావరణాన్ని కల్పించి, ఆనందంగా మ్యాచ్‌ను చూసేందుకు దేశంలో ఎక్కడా లేని రీతిలో తొలిసారిగా ఏపీలో పెద్ద స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అక్కడ ఫుడ్ కౌంటర్లు కూడా ఉంటాయన్నారు. అడిగిన తక్షణమే పెద్ద స్క్రీన్లు ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆయన తెలిపారు.

తల్లీబిడ్డ సంరక్షణపై నేడు శిక్షణ

అనంతపురం మెడికల్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు తల్లీ బిడ్డ సంరక్షణ కోసం ప్రభుత్వ వైద్య కళాశాల కాన్ఫరెన్స్ హాలులో చిన్నపిల్లల, గైనిక్ విభాగం సిబ్బందికి కేర్ కంపానియన్ కార్యక్రమంపై శనివారం శిక్షణ తరగతులు ఉంటాయి. ఏపీ ప్రభుత్వం, నూరా హెల్త్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శిక్షణ ఉంటుందని నర్సింగ్ సూపరింటెండెంట్ మంజు శుక్రవారం తెలిపారు. శిక్షణా తరగతులకు స్టాఫ్ నర్సులు హాజరు కావాలన్నారు.

సుంకులమ్మ ఆలయంలో చోరీ

పెద్దవడుగూరు: గుత్తిఅనంతపురం సమీపంలోని సుంకులమ్మతల్లి ఆలయంలో జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి ఆలయంలో ప్రవేశించి హుండీ పగులగొట్టి అందులో ఉన్న నగదు ఎత్తుకెళ్లారు. గ్రామ సర్పంచ్ మురళీధర్‌రెడ్డి, గ్రామపెద్దల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనస్థలిని పరిశీలించారు. హుండీలో దాదాపు రూ.10 వేల ఉండొచ్చని భావిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

కందిలో యాజమాన్య పద్ధతులు అవసరం



కంది పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

బుక్కరాయసముద్రం: రైతులు కంది పంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం పప్పుధాన్యాల ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రమణ పేర్కొన్నారు. శుక్రవారం రేకులకుంటలో సాగు చేసిన కంది పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం కంది పంట బెట్ట పరిస్థితుల్లో ఉందన్నారు. బెట్ట నివారణకు ట్రాక్టర్ ద్వారా నీటి తడులు ఇవ్వడంతో పాటు 19.19.19 ఒక కిలో చొప్పున 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. పంట పూత దశలో ఉందని, పచ్చ పురుగు లార్వాను తినుటకు అనుగుణంగా ఎకరాకు 10-15 పక్షి స్థావరాలు ఏర్పర్చుకోవాలన్నారు. రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

గార్లదిన్నె: గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక గ్రంథాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పిల్లలకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించగా వాటిని పరిశీలించారు. గ్రంథాలయ అధికారి శిరీష ,ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం తిలోత్తమ పాల్గొన్నారు.

పామిడి: స్థానిక గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ విద్యార్థులకు గ్రంథాలయ ప్రాముఖ్యతను తెలియజేశారు. గ్రంథాలయాధికారి సీ వెంకటలక్ష్మి, అతిథులు స్రవంతి, కేశవరెడ్డి, రంగప్ప, నారాయణమూర్తి, లీలామనోహర్, కృష్ణశాస్త్రి పాల్గొన్నారు.

గుంతకల్లు: స్థానిక గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం కవి సమ్మేళనం ఏర్పాటు చేశారు. మహిళ అష్టావధాని ఎంకే ప్రభావతి, ఉపన్యాసకులు కొండారెడ్డి, అధ్యాపకులు అష్టావధానం ఆకట్టుకుంది. అనంతరం వారిని ఘనంగా సన్మానించారు ప్రథమ శ్రేణ గ్రంథాలయాధికారి సి.కమ్మన్న, సహాయ గ్రంథాయలధికారి హేమలత పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో ఫొటోలు అప్‌లోడ్

- పోలీసులను ఆశ్రయించిన యువతి

అనంతపురం క్రైం: గుర్తు తెలియని వ్యక్తులు సోషల్ మీడియాలో తన ఫొటోలను పెట్టారని ఓ యువతి అనంతపురం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదుతోపోలీసులు సంబంధిత ఇన్‌స్టాగ్రామ్ ఐడీ, ఇతర వివరాలను సేకరిస్తున్నారు. టెక్నికల్ విభాగం అధికారులకు సంబంధిత వివరాలను బదిలీ చేశారు. అవి రాగానే ఎవరైతే యువతి ఫొటోలను ఇన్‌స్టాగామ్‌లో అప్‌లోడ్ చేశారో వారిపై చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

పంచాయతీల ఆర్థికాభివృద్ధిపై శిక్షణ

అనంతపురం రూరల్: పంచాయతీ పరిధిలో ఉన్న వనరులను ఉపయోగించుకుని గ్రామాలను ఎలా అభివృద్ధి చేసుకోవాలన్న అంశంపై నేడు (శనివారం) పంచాయతీ కార్యదర్శులు, ఈఓఆర్‌డీలు, సర్పంచులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ రావు తెలిపారు. శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు.

శిక్షణకు అధికారుల ఎంపిక

అనంతపురం సిటీ: ఉమ్మడి చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తిలో ఈ నెల 20 నుంచి మొదలుకానున్న మలి విడత శిక్షణకు అనంతపురం జిల్లా నుంచి 12 మండలాలకు చెందిన ఎంపీడీఓలు, ఏపీఓలు ఎంపికయ్యారు. తాడిపత్రి, కంబదూరు, కూడేరు, ఆత్మకూరు, పెద్దపప్పూరు, కుందుర్పి, రాప్తాడు, రాయదుర్గం, ఉరవకొండ, విడపనకల్లు, యాడికి, యల్లనూరు మండలాల అధికారులను ఎంపిక చేశారు. వీరికి ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకుశిక్షణ ఇస్తారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులకు సంబంధించిన ప్రణాళిక రూపొందించే అంశంపై రెసిడెన్షియల్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు.